

రూ.50కోట్లు కేటాయించాలి

మదర్ డెయిరీకి ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించాలని మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి కోరారు. - 8లో



ఉధృతంగా కృష్ణమ్మ

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటి విడుదల చేస్తుండడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	585.30 అడుగులు
ఇన్‌ఫ్లో	:	5,91,456 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	5,91,456 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,333 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,533 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	5,874 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,200 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్



నల్లగొండలో బతుకమ్మలతో చిన్నారులు



రామాలయంలో భారీ బతుకమ్మ

రామ రామ రామ ఉయ్యాలో..



నల్లగొండలోని బీట్ మార్కెట్ రామకోటిస్తూప దేవాలయ ఆవరణలో సోమవారం బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జిల్లా పోలీస్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఎఎస్పీ మౌనిక



నల్లగొండలోని వల్లభరావు చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న యువతి



న్యూస్‌రీల్

డిప్యుటేషన్లను రద్దుచేయాలి

నల్లగొండ: నిబంధనలకు విరుద్ధంగా చేసిన డిప్యుటేషన్లను రద్దుచేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కాకుండా డిప్యుటేషన్లు చేశారని ఆరోపించారు. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. సమావేశంలో బక్క శ్రీనివాసచారి, రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఉపాధ్యక్షులు నర్రా శేఖర్‌రెడ్డి, వడిత్య రాజు, ఎడ్ల సైదులు, జిల్లా కార్యదర్శులు ఎం.శ్రీనివాస్‌రెడ్డి, గేర నరసింహ, నలపరాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమర్రాజు సైదులు పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన అర్జీలను నెలల తరబడి పెండింగ్ పెట్టకుంటా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదులు అందజేసిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితలకు న్యాయం చేయాలన్నారు. ఈ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రిజిస్టర్ విధానం స్పీడ్ పోస్టులో విలీనం

రామగిరి(నల్లగొండ): బ్రిటిష్ కాలం నుంచి అమలవుతున్న రిజిస్టర్ పోస్టు విధానాన్ని తపాల శాఖ స్పీడ్ పోస్టులో విలీనం చేసిందని ఆ శాఖ నల్లగొండ సూపరింటెండెంట్ కె.రఘునాథస్వామి అన్నారు. సోమవారం ఆయన నల్లగొండలో విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా అన్ని పోస్టల్ సర్వీస్‌లను ఏకీకృత టారిఫ్‌గా రూపొందించారన్నారు. అంతేకాకుండా కొత్తగా ఓటీపీ ఆధారిత డెలివరీ సర్వీస్ తీసుకొచ్చిందన్నారు. విద్యార్థుల స్పీడ్ పోస్టు ధర 10 శాతం తగ్గిందన్నారు. కొత్తగా బల్క్ సేవలు వినియోగించుకునే సంస్థలకు ప్రత్యేకంగా 5 శాతం తగ్గించిందని ఆయన తెలిపారు.



శ్రీసరస్వతిదేవిగా అమ్మవారు

కనగల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కనగల్ మండలం దర్వేశిపురంలోని ఆలయంలో సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన రేణుక ఎల్లమ్మ తల్లి.

మోగిన స్థానిక నగారా

ఐదు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

- వచ్చే నెల 23, 27న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- నవంబర్ 11న ఓట్ల లెక్కింపు, ఫలితాలు
- వచ్చే నెల 31, నవంబర్ 4, 8న పంచాయతీలకు..
- పోలింగ్ రోజు సాయంత్రమే ఫలితాలు
- అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మొదటి విడత సర్పంచ్ ఎన్నికల వివరాలు..

డివిజన్	పంచాయతీలు	పోలింగ్ కేంద్రాలు
నల్లగొండ	214	1,946
చండూరు	104	924
	రెండో విడతలో..	
మిర్యాలగూడ	282	2,418
	మూడో విడతలో	
దేవరకొండ	269	2,206

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: స్థానిక సంస్థల సమరానికి రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే నెల 9వ తేదీన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు మొదటి విడత నోటిఫికేషన్‌ను జారీ చేయనుంది. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలో రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, మూడు విడతల్లో పంచాతీయ ఎన్నికలను నిర్వహించేలా షెడ్యూలు జారీ చేసింది. దీంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలను నిర్వహించేలా ఎన్నికల సంఘం షెడ్యూలు జారీ చేసింది. ఆ తరువాత గ్రామ పంచాయతీల ఎన్నికలను నిర్వహించనుంది. జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను మొదటి విడతలో 18 మండలాల్లో ఎన్నికలకు వచ్చేనెల 9న నోటిఫికేషన్ జారీ చేసి, 23న ఎన్నికలను నిర్వహించనుంది. రెండో విడతలో 15 మండలాల్లో ఎన్నికలకు వచ్చే నెల 13న నోటిఫికేషన్ జారీ చేసి, 27న పోలింగ్ నిర్వహించేలా షెడ్యూల్ జారీ చేసింది.

డివిజన్ల వారీగా పల్లెపోరు

ఇక గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడతలో నల్లగొండ, చండూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 14 మండలాల్లో అక్టోబర్ 31న ఎన్నికలు నిర్వహించనుంది. ఇందుకోసం వచ్చే నెల 17వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇక రెండో విడతలో మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లోఎన్నికలకు వచ్చే నెల 21వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి, నవంబర్ 4వ తేదీన పోలింగ్ నిర్వహించనుంది. మూడో విడతలో దేవరకొండ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో ఎన్నికలకు వచ్చే నెల 25వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి, నవంబర్ 8వ తేదీన ఎన్నికలను నిర్వహించనుంది. అదే రోజు ఫలితాలు వెల్లడించనుంది.

353 ఎంపీటీసీ, 33 జెడ్పీటీసీలు

జిల్లాలో 353 ఎంపీటీసీ, 33 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలను 1,957 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించనుంది. మొదటి విడతలో నల్లగొండ, దేవరకొండ డివిజన్లలోని 196 ఎంపీటీసీ స్థానాలకు 483 గ్రామాలు, 4,152 వార్డుల్లో ఎన్నికలను నిర్వహించనుంది. ఇందుకోసం 516 ప్రాంతాల్లో 1,099 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. రెండో విడతలో చండూరు, మిర్యాలగూడ డివిజన్లలోని 157 ఎంపీటీసీ స్థానాలకు 386 గ్రామాలు, 3,342 వార్డుల్లో ఎన్నికలను నిర్వహించనుంది. ఇందుకు 419 ప్రాంతాల్లో 858 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనుంది.

తొలి విడత ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన వివరాలు..

ఎంపీటీసీలు	గ్రామాలు	వార్డులు	పోలింగ్‌కేంద్రాలు
196	483	4,152	1,099
రెండు విడతలో..			
353	869	7,494	1,957

ఎంపీటీసీ స్థానాలు 353	పంచాయతీ వార్డులు 7,494
మొత్తం పోలింగ్‌స్టేషన్లు 1957	పోలింగ్‌బాక్స్‌లు: 9,996
పోలింగ్ సిబ్బంది పీవోలు 2,348, ఓపీవో 10,982	
అధికారులు: జెడ్పీటీసీ ఆర్‌వోలు 39, ఎంపీటీసీ ఆర్‌వోలు 140, ఏఆర్‌వోలు 140	
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 652	సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు 304
అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 18	

869 గ్రామాలు.. 7,494 వార్డులు

జిల్లాలో 33 మండలాల పరిధిలోని 869 గ్రామ పంచాయతీలకు, వాటి పరిధిలోని 7,494 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి విడతలో నల్లగొండ, చండూరు డివిజన్ల పరిధిలోని 14 మండలాల్లోని 318 గ్రామాలు, 2,870 వార్డులకు ఎన్నికలు జరుగున్నాయి. రెండో విడతలో మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని 10 మండలాలకు చెందిన 282 గ్రామాలు, 2,418 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. మూడో విడతలో దేవరకొండ డివిజన్ పరిధిలోని 9 మండలాలకు చెందిన 269 గ్రామాలు, 2,206 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు.

దాదాపు సగం సర్పంచ్ స్థానాలు బీసీలకే..

జిల్లాలోని 869 గ్రామ పంచాయతీల్లో పూర్తిగా గిరిజనులకు కేటాయించినవి పోగా మిగితా 755 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 42 శాతం రిజర్వేషన్ల ప్రకారం దాదాపు సగం సర్పంచ్ పదవులు బీసీలకు లభించనున్నాయి. 147 స్థానాలు పూర్తిగా బీసీ మహిళలకు కేటాయించగా, 163 బీసీ జనరల్‌కు కేటాయించారు. ఇలా మొత్తంగా 310 సర్పంచ్ స్థానాలు, 2,638 వార్డులు బీసీలకు దక్కనున్నాయి.

114 గిరిజన గ్రామ పంచాయతీలు

తండాలుగా మార్చిన 114 గిరిజన గ్రామ పంచాయతీలన్నీ వారికే రిజర్వు అయ్యాయి. వాటిల్లో 856 వార్డులు ఉన్నాయి. ఆయా గ్రామ పంచాయతీలతోపాటు రిజర్వేషన్ల కోటా మేరకు అదనంగా మరో 78 పంచాయతీలు ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. వాటి పరిధిలోని 577 వార్డులు గిరిజనులకే దక్కనున్నాయి. దీంతో ఈసారి మొత్తంగా గిరిజన సర్పంచ్‌ల సంఖ్య 192కు చేరనుండగా, 1,433 వార్డుల సభ్యులు గిరిజనులే ఉండనున్నాయి. ఇక ఎస్సీలకు 153 సర్పంచ్ స్థానాలు, 1,281 వార్డులు లభించనున్నాయి. అన్ రిజర్వుడ్ కేటగిరీలో 214 పంచాయతీలు ఉన్నాయి. అన్ని కేటగిరీల్లో 50 శాతం మహిళలకు కేటాయించారు.

ఓటు హక్కు వినియోగించుకోనున్న 10.73 లక్షల మంది

10,73,506 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారిలో 5,30,860 మంది పురుషులు, 5,42,589 మంది మహిళలు, 57 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు.

పార్టీ గుర్తులపై ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను పార్టీ గుర్తులపైనే నిర్వహించనున్నారు. ఇక గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తిగా రాజకీయ పార్టీలకు అతీతంగా జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ఈవీఎంల మాదిరిగానే బ్యాలెట్ పేపర్లపై కూడా 'నోటా' గుర్తును ఏర్పాటు చేస్తున్నారు. ఇక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, పంచాయతీ ఎన్నికలకు ఉదయం 7 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట దాకా పోలింగ్ జరుగుతుంది. గంట భోజన విరామం తర్వాత పోలింగ్ జరిగిన రోజే మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి, విజేతలను ప్రకటిస్తారు. మరునాడు ఉప సర్పంచ్‌ల ఎన్నిక ఉంటుంది. ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మాత్రం నవంబర్ 11న ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుంది.

స్థానిక ఎన్నికలు సవ్యంగా నిర్వహించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను సవ్యంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. దీనికి హాజరైన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మొదటి విడత నల్లగొండ, దేవరకొండ డివిజన్లకు సంబంధించి 18 మండలాలు, రెండవ విడతన చండూరు, మిర్యాలగూడ డివిజన్లకు సంబంధించి 15 మండలాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత నల్లగొండ, చండూరు డివిజన్లలో 318 గ్రామపంచాయతీలు, రెండవ విడత మిర్యాలగూడ డివిజన్లలో 282 గ్రామపంచాయతీలు, మూడవ విడత దేవరకొండ డివిజన్ పరిధిలోని 269 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణకు 996 బ్యాలెట్ బాక్స్‌లు అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే ఎన్నికలపై ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈనెల 30న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు ఇన్‌చార్జ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఏసీపీ మౌనిక, జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, డీపీఓ వెంకయ్య, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీఓలు వై.అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, డీఈఓ భిక్షపతి, ఆర్టీఓ లావణ్య అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలి

నల్లగొండ: ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం నల్లగొండలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ప్రభుత్వ పథకాలు మంజూరు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, గ్రౌండింగ్ వంటివి చేయకూడదన్నారు. నవంబర్ 11 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉన్నందున అప్పటివరకు ప్రజావాణి కార్యక్రమం జరగదని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాలు పక్కాగా పనిచేయాలన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజాప్రతినిధులతో సమావేశాలు, అధికారిక కార్యక్రమాలు, సమీక్షలు నిర్వహించకూడదని సూచించారు. ఇది వరకే ప్రారంభించిన ప్రభుత్వ పథకాలు, అమలవుతున్న పథకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ రాజకీయ పార్టీలకు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన హోర్డింగ్‌లు, కటౌట్లు, పోస్టర్లు, బ్యానర్లు ఉండకూడదన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీఓలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు కమీషన్ ఇప్పించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రేషన్ డీలర్లు

నల్లగొండ: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ కమీషన్‌ను వెంటనే ఇప్పించాలని జిల్లా రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి తమకు రావాల్సిన కమీషన్ ప్రభుత్వం నుంచి ఇప్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు నాగరాజు పులిచింతల సత్తిరెడ్డి, వగిళ్ల వెంకటేశ్వర్లు, బొల్లా వేణు గోపాలరావు, సముద్రాల యాదయ్య గౌడ్, జనార్దన్, వివిధ ప్రాంతాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేశాం

- బీఆర్‌ఎస్ నేతలు దమ్ముంటే చర్చకు రావాలి
- ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్



పోస్టర్ విడుదల చేస్తున్న శంకర్‌నాయక్, గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు

నల్లగొండ: ఇచ్చిన హామీలు అమలు చేశామని, బీఆర్‌ఎస్ నేతలు దమ్ముంటే చర్చకు రావాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ బీఆర్‌ఎస్ బాకీ కార్డుల పోస్టర్‌ను విడుదలచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎలాంటి అభివృద్ధి చేయకుండా ప్రాజెక్టుల పేరుతో పేదల సొమ్మును దోచుకుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీలకు మూడెకరాల భూమి పంపిణీ, రైతులకు రుణమాఫీ, ఐదు సంవత్సరాల వడ్డీ బాకీ, నిరుద్యోగులకు నెలకు రూ.3000 బాకీ, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల బాకీలు పడిందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న జగదీష్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డిని గొల్లగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేయాలన్నారు. తిప్పర్తిలో ఆరు గ్యారంటీలపై విడుదల చేసిన కార్డుపై నల్లగొండ సెంటర్‌లో చర్చకు రావాలని జగదీష్‌రెడ్డికి సవాల్ విసిరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి సూర్యాపేట సీటు కూడా దక్కదన్నారు. ఈ సమావేశంలో నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కనగల్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, చీదేటి వెంకట్‌రెడ్డి, షబ్బీర్ బాబా, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, కొప్పు నవీన్‌గౌడ్, పిల్లి యాదగిరి యాదవ్, కిన్నెర అంజి, పెరికె చిట్టి, విజయ్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: పోలీస్ స్టేషన్లకు వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోలీసులను ఆదేశించారు. నల్లగొండలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌లో 25మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

నల్లగొండ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజల కోసం పోరాటాలు చేసే సీపీఎం శ్రేణులను ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. స్థానిక సంస్థ ల ఎన్నికల్లో రిజర్వేషన్ ప్రక్రియ సక్రమంగా జరగలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రిజర్వేషన్ స్థానాల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని తక్షణమే వాటిని సవరించాలన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి అయిలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, సయ్యద్ హాశం, పాలడుగు ప్రభావతి, చిన్నపాక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


నాలుగు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం వరకు మూసీ రిజర్వాయర్‌కు 9,152 క్యూసెక్కుల నీరు వస్తుండగా అధికారులు ప్రాజెక్టు నాలుగు క్రస్టు గేట్లను మూడు అడుగుల మేర పైకెత్తి 7,994 క్యూసెక్కుల దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా 643.50 వద్ద నిలకడగా ఉంచి నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే మూసీ కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు 191 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.06 టీఎంసీల నీరు న్విల ఉందని అధికారులు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ



నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు



టెయిల్‌పాండ్ నుంచి విడుదలవుతున్న నీరు

- నాగార్జునసాగర్ 26 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- వాడపల్లిలో కృష్ణా, మూసీ సంగమం వద్ద నీట మునిగిన పుష్కర ఘాట్లు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద పోటెత్తుతోంది. 5,91,456 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా.. 26 క్రస్ట్ గేట్ల ద్వారా 5,41,516 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదనతో 33,333 క్యూసెక్కులు మొత్తం 5,74849 క్యూసెక్కుల నీటిని దిగువన కృష్ణ నదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి కాలువ, ఎడమ కాలువ, ఏఎమ్మార్పీ కాల్వలకు 16,607 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కృష్ణా, మూసీ సంగమం వద్ద ఉగ్రరూపం..

మిర్యాలగూడ: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి వరద నీరు భారీగా వస్తుండడంతో టెయిల్‌పాండ్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో మూసీ నది పొంగుపొర్లుతుండగా గేట్లు ఎత్తారు. దీంతో దామరచర్ల మండలం వాడపల్లి వద్ద కృష్ణా, మూసీ నదులు కలిసే సంగమం వద్దకు భారీగా వరద నీరు వస్తోంది. దీంతో శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు స్నానాలు ఆచరించేందుకు ఏర్పాటు చేసిన ఘాట్లతో పాటు విద్యుత్ స్తంభాలు నీట మునిగాయి.

మట్టపల్లి క్షేత్రం వద్ద..

మఠంపల్లి: మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రం వద్ద కృష్ణా నది సోమవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో పాటు మూసీ నది నుంచి వచ్చే వరద నీరు, హాలియా తదితర వాగుల నుంచి వచ్చే వరద నీటితో మట్టపల్లి క్షేత్రం వద్ద కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. అంతేకాకుండా పులిచింతల ప్రాజెక్టులో సుమారు 40 టీఎంసీల నీటిని నిల్వ చేస్తూ పైనుండి వస్తున్న వరద నీటిని కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు. దీంతో పులిచింతల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ మట్టపల్లి వరకు నిల్వ ఉంటూ నిండుకుండను తలపిస్తోంది. ఈ దృశ్యం మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి వచ్చే వారిని ఆకట్టుకుంటోంది.



దామరచర్ల మండలం వాడపల్లి సంగమం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణా, మూసీ నదులు

16 గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల



మేళ్లచెరువు: పులిచింతల ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

మేళ్లచెరువు : నాగార్జునసాగర్ గేట్లు పూర్తిగా ఎత్తడంతో టెయిల్‌పాండ్‌తో పాటు మూసీ నుంచి భారీగా వరద నీరు వచ్చి చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుతో చేరుతోంది. సోమవారం రాత్రి వరకు పులిచింతల ప్రాజెక్టు నీటి మట్టం పూర్తిస్థాయికి చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 5,92,320 క్యూసెక్కుల వరద వస్తుండగా 16 గేట్లను 5 మీటర్ల మేరకు ఎత్తి 5,92,920 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో గోల్‌మాల్

మేళ్లచెరువు: తనకు అందాల్సిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గతంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్ బ్యాంకులో వేసి డబ్బులు తీసుకున్నాడని లబ్ధిదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలం రామాపురం గ్రామానికి చెందిన మద్ద వెంకటేశ్వర్లు పక్షవాతం వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొంది సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.2.50లక్షలకు చెక్కు మంజూరైంది. అయితే గతంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన వెంకట్ ఆ చెక్కును కోదాడలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో వేసి తనకు తెలియకుండా డబ్బులు డ్రా చేశాడని బాధితుడు వెంకటేశ్వర్లు మేళ్లచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

భువనగిరి: నీటి గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై భువనగిరి పట్టణ శివారులో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని పెద్దవాడకు చెందిన కడారి రమేష్(53) ఆదివారం తన కుమారుడితో కలిసి స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో ఫంక్షన్‌కు హాజరయ్యాడు. అదేరోజు సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటికి వెళ్లే సమయానికి రమేష్ కనిపించకపోవడంతో అతడి కుమారుడు ఒక్కడే ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి వరకు కూడా రమేష్ ఇంటికి రాకపోవడంతో అతడికి ఫోన్ చేయగా.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని ఘట్కేసర్‌లో ఉన్నట్లు చెప్పాడు. అనంతరం అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. కాగా.. మంగళవారం ఉదయం భువనగిరి పట్టణ శివారులోని దీప్తి హోటల్ సమీపంలో వరంగల్–హైదరాబాద్‌జాతీయ రహదారి పక్కన ఉన్న నీటి గుంతలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్న రమేష్ కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మృతిచెందింది రమేషే అని గుర్తించారు. సమాచారం తెలుసుకున్నపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. తన తండ్రి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతిచెంది ఉండవచ్చని రమేష్ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

22 ఏళ్లు దేశ రక్షణలో..

- నేడు పదవీ విరమణ పొందనున్న చిలుకూరుకు చెందిన ఆర్మీ జవాన్



బెల్లంకొండ రవి

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రానికి చెందిన బెల్లంకొండ వేలాద్రి కుమారుడు రవి 22 ఏళ్లు దేశ రక్షణలో ఆర్మీ జవాన్‌గా సేవలందించి మంగళవారం పదవీ విరమణ పొందనున్నారు. ఆయన 2003లో డిగ్రీ మొదటి సంవత్సరంలోనే ఉండగానే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొని ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని హేమనగర్‌లో శిక్షణ పొంది 2005లో ఆర్మీ జవాన్‌గా సైన్యంలో చేరారు. అప్పటి నుంచి జమ్మూ కశ్మీర్, పంజాబ్, హిమాచలప్రదేశ్‌లో పనిచేశారు. ఇటీవల భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో కూడా ఆయన పాల్గొని దేశానికి సేవలందించారు. ప్రస్తుతం అహ్మదానగర్‌లో పనిచేస్తున్న ఆయన మంగళవారం పదవీ విరమణ పొందనున్నారు.

దసరా రోజు అభినందన సభ..

రవి పదవీ విరమణ పొంది స్వగ్రామానికి వస్తున్న సందర్భంగా అక్టోబర్ 2న దసరా రోజు చిలుకూరు మండల కేంద్రంలో ర్యాలీతో పాటు అభినందన సభ నిర్వహించేందుకు గ్రామ యువత, కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

యాదగిరీశుడి సేవలో పాదరాజ మఠం పీఠాధిపతి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని శ్రీపాదరాజ మఠం పీఠాధిపతి శ్రీసుజయనిధి తీర్థ ముల్బాగల్ స్వామిజీ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠ అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలో ఆయనకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు.



శ్రీసుజయనిధి తీర్థ ముల్బాగల్ స్వామిజీకి స్వాగతం పలుకుతున్న అర్చకులు

యాదగిరిగుట్టలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

యాదగిరిగుట్ట: దసరా పండుగను పురస్కరించుకొని యాదగిరిగుట్ట పట్టణంలోని వైకుంఠద్వారం వద్ద సోమవారం రాత్రి బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి యాదగిరి క్షేత్రానికి భక్తులు వస్తుండటంతో పాటు సద్దుల బతుకమ్మ వేడుకల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తనిఖీలు చేపట్టినట్లు సిబ్బంది వెల్లడించారు.

స్వర్ణగిరిలో సహస్ర కుంకుమార్చన, అక్షరాభ్యాసం

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో దసరా శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారిని విద్యాలక్ష్మిగా అలంకరించి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంతకుమందు ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణ మహోత్సవం, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు.



విద్యాలక్ష్మి అమ్మవారి వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

భువనగిరిలో నకిలీ నోట్ల కలకలం

భువనగిరి: భువనగిరి పట్టణంలో సోమవారం నకిలీ నోట్లు కలకలం సృష్టించాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని ఖిలానగర్‌లో మొబైల్ షాపు నిర్వహిస్తున్న పల్లెర్ల నాగేంద్రబాబు వద్దకు సోమవారం గుర్తుతెలియని వ్యక్తి వచ్చి.. తన దగ్గర రూ.11వేల నగదు ఉందని, తన బంధువులకు ఫోన్ పే చేయాలని వేడుకున్నాడు. దీంతో నాగేంద్రబాబు తన ఫోన్ ద్వారా సదరు వ్యక్తి చెప్పిన నంబర్‌కు రూ.11వేలు ఫోన్ పే చేయగా.. అతడు రూ.11వేల నగదును నాగేంద్రబాబుకు ఇచ్చాడు. అనంతరం నాగేంద్రబాబు నోట్లను పరిశీలించగా.. అవి దొంగ నోట్లని అనుమానం వచ్చి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని సదరు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.



మొబైల్ షాపు యజమానికి గుర్తుతెలియని వ్యక్తి ఇచ్చిన నకిలీ నోట్లు

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్ : కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన వ్యక్తి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణంలోని రాంనగర్‌కాలనీకి చెందిన బొల్లు రామచంద్రం(65) స్థానిక భాస్కర్ థియేటర్‌కి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగా సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రాకపోవడంతో అతడి కుమారుడు థియేటర్ వద్దకు వెళ్లి చూడగా అక్కడే ఉన్న మంచంపై రామచంద్రం పడి ఉన్నాడు. పక్కనే విషం బాటిల్ ఉండడాన్ని గమనించి అతడి కుమారుడు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. కాగా గతేడాది రామచంద్రం భార్య అనారోగ్యంతో మృతిచెందగా.. చిన్న కుమారుడు ఇంకా స్థిరపడకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి పెద్ద కుమారుడు బొల్లు ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

హత్య కేసులో పది మంది అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు
- పరారీలో మరో ఇద్దరు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని వ్యక్తిని హత్య చేసిన పది మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సోమవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని అన్నాదురై నగర్‌కు చెందిన ఫ్లవర్ డెకరేషన్ చేసే పెద్ది లింగస్వామికి, చారగండ్ల శివకుమార్‌కు ఐదేళ్ల క్రితం ఘర్షణ జరిగింది. ఆ సమయంలో శివకుమార్‌పై హత్యాయత్నం చేసిన పెద్ది లింగస్వామిపై కేసు నమోదైంది. అప్పటి నుంచి పెద్ది లింగస్వామి శివకుమార్‌పై పగ పెంచుకున్నాడు. ఈ నెల 26న మధ్యాహ్నం చారగండ్ల శివకుమార్, పెద్ది లింగస్వామికి సూర్యాపేట పట్టణంలోని పూల సెంటర్ వద్ద మరోసారి ఘర్షణ జరిగింది. దీంతో పెద్ది లింగస్వామి తన స్నేహితులు మాతంగి మధు, మరికొంత మందితో కలిసి శివకుమార్‌ను హత్య చేయాలని పథకం వేశాడు. ఈ మేరకు అదే రోజు సాయంత్రం శివకుమార్‌కు మాతంగి మధుతో ఫోన్ చేయించి కుసుమవారిగూడెం వైన్ షాప్ వద్దకు పిలిపించాడు. శివకుమార్ వైన్ షాప్ ఎదురుగా ఉన్న విజయ్ హోటల్ వద్ద రాత్రి 10గంటల సమయంలో మందు తాగుతుండగా.. పెద్ది లింగస్వామి, అతడి స్నేహితుడు మాతంగి మధు, మరికొందరు కలిసి మారణాయుధాలతో శివకుమార్‌ను హత్య చేసి పరారయ్యారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పది మంది నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. కాగా హత్యకు గురైన శివకుమార్‌తో పాటు నిందితులపై గతంలో రౌడీషీట్ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి ఒక స్కూటర్, మూడు మోటార్ సైకిళ్లు, మూడు కత్తులు, రెండు గొడ్డళ్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మొత్తం 12 మందిపై కేసు నమోదు..

ఈ హత్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో ప్రధాన నిందితుడైన సూర్యాపేట పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మాతంగి మధు అలియాస్ కర్రీ మధు, పెద్ది లింగస్వామి, సీతారాంపురానికి చెందిన చెవుల నరేష్, జేజేనగర్‌కు చెందిన జక్కి సతీష్, కేసారం గ్రామానికి చెందిన భాషపంగుల సతీష్, సూర రామచంద్రు, తాళ్లగడ్డకు చెందిన నేరెళ్ల శ్రీరాములు, అన్నాదురైనగర్‌కు చెందిన గువ్వల తరుణ్‌కుమార్, కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన చింతపల్లి వెంకటేష్, ఇందిరమ్మ కాలనీకి చెందిన జెల్లా ఉదయ్‌కుమార్ అరెస్టయ్యారు. జేజేనగర్‌కు చెందిన జక్కి అనిల్, కృష్ణటాకీస్ దగ్గర గల వర్రె రామకృష్ణ పరారీలో ఉన్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీకి రూ.50 కోట్లు కేటాయించాలి

- ప్రభుత్వానికి చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తి



విలేకరులతో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

సాక్షి,యాదాద్రి: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పుల కుప్పగా మారిన మదర్ డెయిరీని ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించాలని మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి కోరారు. సోమవారం భువనగిరి మిల్క్ చిల్లింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన ఏడాది కాలంలో మదర్ డెయిరీ అప్పుల పాలైనట్లు బీఆర్‌ఎస్ నాయకుడు గొంగిడి మహేందర్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలోనే మదర్ డెయిరీని దివాలా దిశకు చేర్చారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చైర్మన్లు వేలాది మంది రైతులు, డెయిరీలో పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్తును తాకట్టు పెట్టారన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన విచారణలో పదేళ్లలో జరిగిన అక్రమాలు బయటకు వస్తాయన్నారు. మదర్ డెయిరీని ఎన్‌డీడీబీ టేకోవర్ చేయడానికి సిద్ధంగా ఉందని.. ఒకవేళ అలా జరగకపోతే అప్పుల కింద బ్యాంకు వాళ్లే లాకౌట్ చేస్తారన్నారు. నష్టాల్లో ఉన్న సంస్థను లాభాల్లో ఉన్నట్లు తప్పుడు ఆడిట్ రిపోర్టులు తయారు చేసి, బ్యాంకును నమ్మించడానికి అప్పులకు కూడా ఇన్‌కం టాక్స్ కట్టిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. డైరెక్టర్ల ఎన్నికల్లో పొత్తు ధర్మం తప్పింది గొంగిడి మహేందర్‌రెడ్డే అన్నారు. తన పార్టీకి చెందిన వ్యక్తిని అదనంగా పోటీలో నిలబెట్టి డబ్బులు ఇచ్చి గెలిపించుకున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అదనంగా రంగంలో దిగితే షోకాజ్ నోటీస్ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. డబ్బులు ఇచ్చి, పాల చైర్మన్లకు ఫోన్లు చేసిన గొంగిడి మహేందర్‌రెడ్డి నైతికవిలువలు మర్చిపోయాడన్నారు. గత బీఆర్‌ఎస్ పాలకవర్గాల బాధ్యతారాహిత్యమే నేటి దుస్థితికి కారణమని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో డైరెక్టర్లు గొల్లపల్లి రాంరెడ్డి, పుప్పాల నర్సింహులు, కర్నాటి జయశ్రీ ఉప్పల్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

చిట్యాల: చిట్యాల మండలం వెంబావి గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ ఎం. రవికుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వెంబాయి గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి నల్లగొండలోని ఓ కాలేజీలో నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. దసరా సెలవులు రావడంతో ఈ నెల 26న స్వగ్రామానికి వచ్చింది. ఆదివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఎంత వెతికినా తన కుమార్తె ఆచూకీ లభించలేదని, నల్లగొండ మండలం బోడంగిపర్తి గ్రామానికి చెందిన అస్కా శంకరయ్యపై అనుమానం ఉందని యువతి తండ్రి చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. రవికుమార్ తెలిపారు.

బస్ స్టేషన్ల ఆధునీకరణకు నిధులు మంజూరు

రామగిరి(నల్లగొండ): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఐదు బస్ స్టేషన్ల ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తూ ఆర్టీసీ ఎండీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో నల్లగొండ జిల్లాలోని మునుగోడు, చండూరు, మర్రిగూడ బస్ స్టేషన్లతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్, వలిగొండ బస్ స్టేషన్లలో ఆధునీకరణ పనులతో పాటు మరమ్మతులు, అత్యాధునిక సౌకర్యాలు కల్పించనున్నారు.

పండుగకు స్వగ్రామానికి వెళ్తూ మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ఆలేరురూరల్: దసరా పండుగకు హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి కుమారుడితో కలిసి బైక్‌పై వెళ్తున్న మహిళ రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఈ ఘటన సోమవారం హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ఆలేరు మండలం కందిగడ్డతండా శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండలం పల్లగుట్ట గ్రామానికి చెందిన సాదం కోమలి(42) తన భర్త రవి, కుమారుడు రాజుతో కలిసి హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో నివాసముంటోంది. అక్కడే ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో కోమలి, ఆమె భర్త రవి కలిసి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. దసరా పండుగకు కోమలి, ఆమె కుమారుడు రాజు కలిసి సోమవారం బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ఆలేరు మండలం కందిగడ్డతండా శివారులోని ఛత్రపతి శివాజీ దాబా వద్దకు రాగానే అదే మార్గంలో మరో బైక్‌పై వస్తున్న అందె భాస్కర్ వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కోమలి ఎగిరి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుమారుడి ఎలాంటి గాయాలు కాలేదు. కోమలిని వెంటనే ఆమె కుమారుడు ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆలేరు సీఐ యాలాద్రి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కోమలి మృతదేహాన్ని ఆమె బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.